క్లుప్తంగా

జి.మామిడాడలో రేవు శుభ్రం



తుల్యభాగ నదీ పాయ వద్ద రేవును శుభ్రం చేయిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పెదపూడి: జి.మామిడాడలో తుల్యభాగ నదీ పాయ రేవును లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు గ్రామ సచివాలయ పారిశుధ్య కార్మికులతో గురువారం శుభ్రం చేశారు. లయన్స్ క్లబ్ మెంటర్ మండ రాజారెడ్డి మాట్లాడుతూ శ్రావణ మాసం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళలు గంగా పూజలు, పుణ్యస్నానాలు ఆచరిస్తారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రేవు వద్ద శుభ్రం చేసే పనులు చేపట్టామన్నారు. పవిత్ర తుల్యభాగ నదీ పాయలోకి పైప్రాంతాల నుంచి వచ్చిన భారీ వర్షాలకు తూటికాడ చేరిందన్నారు. తూటికాడ, చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించామన్నారు. క్లబ్ కోశాధికారి వీర్రాఘవ రెడ్డి, సీనియర్ సభ్యుడు పప్పు రామకృష్ణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, పాతూరి అప్పారావు, రాయుడు వీర్రాఘవులు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుచరిత్ర పారాయణ



పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: లోక కల్యాణం, ప్రజా సంక్షేమాన్ని కోరుకుంటూ స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న గురుచరిత్ర పారాయణ గురువారం నాలుగోవారానికి చేరుకుంది. స్థానిక సాయి భక్త మండలి ఆధ్వర్యంలో ప్రతివారం వేకువజామున కాకడ హారతి ఇచ్చిన అనంతరం ప్రారంభమై మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరుగుతోంది. ఆసక్తి ఉన్న భక్తులు పాల్గొనవచ్చు. 12వ వారం (సెప్టెంబర్ 21) సాయి సచ్చరిత్రను పారాయణ చేస్తారు. ఈ విధంగా 12 వారాలు పారాయణలో పాల్గొన్న భక్తులకు ముగింపు రోజున సాయి సచ్చరిత్ర పుస్తకాలను బహుమతిగా అందజేయనున్నారు. కాగా.. రాజానగరానికి చెందిన ఒక భక్తుడు సమర్పించిన తులసి మాలలతో సాయిబాబాకు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.

అవసరం మేరకే పురుగు మందులు వాడాలి



కొప్పవరంలో వరి చేనును పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తల బృందం

అనపర్తి: రైతులు నేల స్వభావం, భూసారానికి అనుగుణంగా మాత్రమే ఎరువులు, పురుగు మందులు వాడాలని మార్టేరు ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ సూచించారు. గురువారం అనపర్తి, కొప్పవరం గ్రామాల్లో వరి పొలాలను ఏరువాక శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో చేలల్లో చేరిన నీరు బయటకు పంపే విధంగా రైతులు చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా చేలకు తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, చీడపీడల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు పలు సూచనలు అందించారు. వీహెచ్ఏ శరత్‌తేజ, వీఏఏ ఆర్.సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో చోరీ

అనపర్తి: పాలమూరు తూర్పుపేట మెయిన్ రోడ్డులోని ఓ ఇంట్లో చోరీ జరిగిందని ఎస్సై పి.అప్పారావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సత్తి అమ్మిరెడ్డి ఈ నెల 19న కుటుంబ సభ్యులతో కలసి విశాఖపట్నంలో ఉంటున్న కుమారుడి ఇంటికి వెళ్లారు. తిరిగి గురువారం పాలమూరు వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన అమ్మిరెడ్డి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని సొత్తు కనిపించలేదు. నాలుగు కాసుల బంగారు ఆభరణాలు, వెండి పట్టీలతో పాటు రూ. 7 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీంతో ఎస్సై అప్పారావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.

బీరువాలో నగదు మాయం

సీతానగరం: చీపురపల్లి పంచాయతీ పరిధి అచ్చయ్యపాలెంలోని మేంటి శ్రీను ఇంటిలో దొంగలు చోరీ చేశారు. ఎస్సై కె.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీను అత్తయ్య ఇటీవల మృతి చెందారు. ఆమె పెద్దకార్యం సందర్భంగా బుధవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ వెళ్లారు. గురువారం ఉదయం 5 గంటలకు ఇంటికి రాగా తాళం బద్దలు కొట్టి ఉంది. లోపలకు వెళ్లి పరిశీలించగా బీరువాలోని రూ.2.50 లక్షలు, కాసు బంగారు, 20 తులాల వెండి మాయమైంది.

నేడు మండల సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.పద్మజ్యోతి గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెరుగుపరిచారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక పాతవూరిలోని కేఏఆర్ జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. పాఠశాల ఏర్పాటుకు, అభివృద్ధికి కృషి చేసిన వైద్యుడు పోతంశెట్టి రామారెడ్డి (రాము డాక్టర్) జయంతిని పురస్కరించుకుని ఏటా పాఠశాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అక్షరాస్యతలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో సీఎం జగన్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారన్నారు. ఇందులో భాగంగా నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా తయారయ్యాయన్నారు. నాడు–నేడులో రూ.93 లక్షలతో కేఏఆర్ పాఠశాలను అభివృద్ధి చేశామని తెలిపారు. అదేవిధంగా పాఠశాలకు చేరే రహదారిని రూ.20 లక్షలతో నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. పదో తరగతి తదితర పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, జ్ఞాపికలను ఎమ్మెల్యే, ముఖ్య అతిథులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులను సత్కరించారు. పాఠశాల పర్యవేక్షణ కమిటీ చైర్మన్ కర్రి ఎర్రబ్బు, శ్రీషిరిడీ సాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పోతంశెట్టి జానకిరామారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్రి దొరబాబు, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, ఎంపీటీసీ ఏడుకొండలు, పంచాయతీ వార్డు సభ్యుడు యాసిడ్ రాము, ఎంఈఓ–2 నల్లమిల్లి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: రంగాపురంలోని డ్రింక్స్ ఫ్యాక్టరీని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రారంభించారు. సర్పంచులు గండి కోట వీరభద్రరావు, లొల్లం భద్రం పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి

- జక్కంపూడి గణేష్
- కాటవరంలో గడప గడపకూ..



పథకాలను వివరిస్తున్న పార్టీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ గణేష్

సీతానగరం: నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. ఆయన గురువారం కాటవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలన్న లక్ష్యంతో గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీతానగరం మండలంలో రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అవినీతి రహితంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వమిదేనన్నారు. కాగా.. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలందుతున్న తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జోత్స్న, ఎంపీటీసీ సభ్యుడు తాడేపల్లి వెంకట్రావు, మండల కన్వీనర్ గంటా శ్రీను, కోకన్వీనర్ కరటూరి హరిబాబు, నాయకులు సుజిరావు, అంబటి రమణ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనే లక్ష్యంగా 'జగనన్న సురక్ష'



కుతుకులూరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి



మధురపూడిలో ధ్రువీకరణ పత్రాల పంపిణీ

అనపర్తి: సుపరిపాలనే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం కుతుకులూరు సచివాలయం–2లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. అర్హులంతా ప్రభుత్వ పథకాలు పొందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రతి సమస్యనూ పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, ఉప సర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఏఓ బి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: రాష్ట్రంలో అమలు జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు ఒక వరమని నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు అన్నారు. మండలంలోని తోకాడలో సర్పంచ్ వేగిశెట్టి వీరవెంకట చక్రధరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన గ్రామసభలో 350 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సుబ్బారావు, ఎంఈఓ జ్యోతిప్రసాద్, ఆర్ఐ సీతారామరాజు పాల్గొన్నారు.

మధురపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ లబ్ధి చేకూరుతోందని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మధురపూడి సచివాలయంలో వైఎస్సార్ సీపీ మండల కోకన్వీనర్ గణేశుల పోసి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ క్రొవ్విడి సత్రాజు మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా వ్యవసాయం రైతులకు అవసరమైన అన్నిరకాల సాయం అందుతోందన్నారు. అనంతరం 1,249 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, నాయకులు ఇండిగమెల్లి సత్యనారాయణ, దాసి జీవరత్నం పాల్గొన్నారు. బుచ్చెంపేటలోనూ జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



సంజీవయ్యనగర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ నేత వీరబాబు, అధికారులు

గోకవరం: స్థానిక సంజీవయ్యనగర్‌లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. సంజీవయ్యనగర్‌లో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు సీసీరోడ్లపై నిలిచిపోయి స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయన గురువారం ఎంపీటీసీ తోలేటి రమ్యశ్రీ, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. వైద్య సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకుని సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవయ్యనగర్‌లో డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తోలేటి రాంప్రసాద్, తాటికొండ సురేష్, నన్నూరి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్‌తో స్వయం ఉపాధి



మెటీరియల్ అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

రాజానగరం: మగ్గం వర్క్‌తో స్వయం ఉపాధి పొందవచ్చని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తతుంగపాడులో రెండో విడత మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఇప్పటికే ఈ గ్రామంలో మగ్గం వర్క్, టైలరింగ్‌లలో ఒక విడత ఉచిత శిక్షణ ఇచ్చామని, స్థానికుల కోరిక మేరకు మరో విడత ప్రారంభిస్తున్నామన్నారు. శిక్షణకు అవసరమైన మెటీరియల్‌ని కూడా ఉచితంగానే అందజేశారు. గంధం కృష్ణవేణి శిక్షకురాలిగా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుంకర వీరాస్వామి, నాగేశ్వర్రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బిక్కవోలు: తొస్సిపూడిలో ఎస్ఆర్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో కొమరిపాలేనికి చెందిన కోసూరి రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అతను ఓ రైస్‌మిల్లులో పనిచేస్తున్నాడు. గురువారం రామకృష్ణ ఇంటి నుంచి బలభద్రపురానికి పనిపై బైక్ మీద వెళ్లాడు. రోడ్డుపై ఉన్న గుంతలో బైక్ పడి అదుపు తప్పి పడిపోయాడు. అతనిని వెంటనే ఆసుపత్రికి తరలించారు.

పారదర్శకంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కొంకుదురులో గడప గడపకూ..



కొంకుదురులో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం కొంకుదురులో మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సీఎం జగన్ ఆదేశాలతో గడప గడపకూ వస్తున్నామని చెప్పారు. అర్హులందరికీ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ హయాంలో పథకాల కోసం జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సి వచ్చేదని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సేవలన్నీ ప్రజల ముంగిటకే చేరుతున్నాయన్నారు. సర్పంచ్ సత్తి వీరమణి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీపీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, నియోజకవర్గ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, మండల కన్వీనర్ మోతుల ప్రసాద్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డిరాజా పాల్గొన్నారు.

రేపు వైద్యశిబిరం

మధురపూడి: జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కోరుకొండ మండలం గాదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జీఎస్ఎల్, సుభద్ర హాస్పిటల్ సౌజన్యంతో 40 మంది ప్రముఖ వైద్యులు సేవలందిస్తారన్నారు. స్త్రీల వైద్యం, మూత్రకోశ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, కంటి సమస్యలు, చిన్నపిల్లల వైద్యం, నరాలు, ఛాతీ, ఊపిరితిత్తులు, గుండె, చర్మం, కీళ్లు, ఎముకలు, దంతాలకు సంబంధించి చికిత్స అందజేస్తారన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: వరదల నేపథ్యంలో పాడి పశువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. ఆయన గురువారం ములకల్లంక గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి పశువుల సమాచారాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పి.ప్రభావతి, డాక్టర్ కె.భానుతేజ ఉన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో విషయ పరిజ్ఞానం



విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందజేస్తున్న నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఇంజినీరింగ్ విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఇంటర్న్‌షిప్ ఎంతో తోడ్పడుతుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కి చెందిన కొందరు విద్యార్థులు సీఎస్ఐఆర్ ల్యాబ్స్ (చెన్నై), ఎరోనాటికల్ డవలప్‌మెంట్ ఏజెన్సీ (బెంగళూరు), రెడ్డి ల్యాబ్స్, ఓఎన్‌జీసీ (రాజమండ్రి, కాకినాడ), ఐఐపీఈ (వైజాగ్), ఐఐటీ (గోవా, తిరుపతి), ఎన్ఐటీ (తిరుచురాపల్లి, వరంగల్), వైజాగ్ స్టీల్ ప్లాంట్ మున్నగు వాటిలో రెండు నెలలు ఇంటర్న్‌షిప్ చేశారు. తిరిగి వచ్చిన ఆ విద్యార్థులు గురువారం వీసీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ, ఇంటర్న్‌షిప్ ప్రాధాన్యత, అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్రావు, హెచ్ఓడీ డాక్టర్ బి. కెజియారాణి, బి.సుధా కిరణ్, హెచ్.హనుమంతు, బి.లక్ష్మి, సీహెచ్ శ్రీవర్మ, బి.కృష్ణ, కేవీ రమణ మౌనిక, డాక్టర్ డి.కిషోర్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి

మధురపూడి: భారత రత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని గురువారం కోరుకొండ సృజన, గాడాలలోని భాను విద్యాసంస్థల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ కలాం జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయమన్నారు.

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రపతిగా పనిచేసి ఆ పదవికే వన్నె తెచ్చిన మహానుభావుడు కలాం అని అన్నారు. ఉపాధ్యాయులు పడాల ఈశ్వర్‌రెడ్డి, శ్రీకృష్ణసాయి, వలీషా, లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

బాబోయ్.. భౌ భౌ



చంద్రేడులో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కుక్కలు

రంగంపేట: పల్లెల్లో గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి.. జనాన్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. చంద్రేడులో కొద్ది రోజులుగా కుక్కల బెడద అధికమైంది. దారిన పోయేవారిని కరవడంతో బయటకు రావడానికే ప్రజలు వణికిపోతున్నారు. కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ వీధుల్లో వెళ్లేవారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కుక్కలకు భయపడి అవి ఉన్న దారి నుంచి కాకుండా వేరే మార్గాల నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఒంటరిగా వెళ్లే పిల్లలు, వృద్ధులు, మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ వీధి కుక్కలు ఇళ్లలోకి సైతం చొరబడి చిందరవందర చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

కేంద్ర బృందాల పర్యటన

పెదపూడి: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ 2023లో భాగంగా కేంద్ర బృందాలు సంపర, వేంద్ర గ్రామాల్లో గురువారం పర్యటించాయి. ఈ బృందంలో కుమార్‌రాజు, రామకృష్ణ త్రినాథ్, గణేష్,, భరత్ ఉన్నారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ స్కూళ్లు, ఆసుపత్రులను పరిశీలించారు. అక్కడ సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అలాగే వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగిస్తున్నారా లేదా, తడి పొడి చెత్త వినియోగం ఎలా జరుగుతుందో ఆరా తీశారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. సచివాలయ కార్యదర్శి సుంకర వీరస్వామి నాయుడు, సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

● ఉరకలెత్తుతున్న గోదారమ్మ



పుష్కరాల రేవులో మునిగిన నిత్యహారతి ప్రదేశం

ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో గోదారమ్మ ఉరకలెత్తుతోంది. నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నగరంలోని వివిధ ఘాట్ల వద్ద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. దీంతో సందర్శకులను అనుమతించడం లేదు. గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు సహాయక చర్యలు చేపడుతున్న నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం అధికారులతో కలిసి గోదావరి ఘాట్‌లను పరిశీలించారు. కోటిలింగాల ఘాట్, పుష్కర ఘాట్, లాంచీల రేవు, సరస్వతీ ఘాట్ ప్రాంతాల్లో వరద పరిస్థితిని సమీక్షించారు. ధవళేశ్వరం బాబా గుడి ప్రాంతంలోని పంపింగ్ స్టేషన్‌లో 150 హార్స్ పవర్ మోటార్లు రెండింటిని ఏర్పాటు చేశామన్నారు. లంకలోని వరద బాధితులకు స్థానిక కోటిలింగాల ఘాట్ వద్ద పందిరి మహాదేవుడు సత్రం లోనూ, రైల్వే స్టేషన్ దగ్గరలోని ఆల్కాట్ గార్డెన్స్ కల్యాణ మండపం లోనూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో వసతులను కమిషనర్ పరిశీలించారు. అడిషనల్ కమిషనర్ సత్యవేణి పాల్గొన్నారు.

– రాజమహేంద్రవరం సిటీ